క్లుప్తంగా

క్రీడల్లో రాణించిన విద్యార్థులు

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలు హైస్కూల్‌లో బుధవారం జరిగిన క్రీడా పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (నెల్లిమర్ల) విద్యార్థులు వాలీబాల్‌లో విజేతలుగాను కబడ్డీలో రన్నర్స్‌గా నిలిచారు. ఈ పోటీలలో 20 ఉన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. విజేతలు త్వరలో భోగాపురంలో జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో తలపడతారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల హెడ్‌మాస్టర్ కె. సూర్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు వి. రామచంద్రుడు, బి. జయకర్ జాన్సన్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా హిందీ దివస్



సంప్రదాయ దుస్తులతో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని రింగ్‌రోడ్‌లో గల శ్రీచైతన్య పాఠశాలలో హిందీ దివస్ (జాతీయ హిందీ భాషా దినోత్సవం) గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రాంతీయ పర్యవేక్షకుడు వి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు, డీన్లు కె.సత్యనారాయణ, సూర్యచంద్ర, సాయి కిశోర్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి

భోగాపురం: గ్రామీణ, పల్లె ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యులు, 104 సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌ఓ దుర్గా మహలక్ష్మి కోరారు. గురువారం స్థానిక మరాడవీధిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రోగాలతో బాధపడుతున్న 60 మంది వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం పద్మావతి, హెచ్‌వీ అరుణకుమారి, 104 డీఈఓ హేమంత్, పైలట్ పురుషోత్తం, ఆశ వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఎన్నికల్లో ఎస్‌ఎన్‌ఈఏ విజయం

విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ మెంబర్‌షిప్ అసోసియేషన్ గుర్తింపు ఎన్నికలను గురువారం కార్యాలయం ఆవరణలో నిర్వహించగా సంచార్ నిగమ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (ఎస్‌ఎన్‌ఈఏ) విజయం సాధించింది. ఈ సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహమూర్తి, అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసనాయుడు, . ఆనందకుమార్, డి.గౌరీశంకర్, కంది శ్రీను, సేవా సభ్యులు డి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలి

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు , వలంటీర్లు, గృహసారథులు ముందుగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ వి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు గ్రామీణప్రాంతాల్లో ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓ, ఆశా, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ప్రజల ఆరోగ్య వివరాలను ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదుచేయడంతో పాటు వైద్యశిబిరాలకు తీసుకువచ్చి వైద్యసేవలు అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శైలజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

పరవాడ: లంకెలపాలెం వంతెన సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సివిల్ ఇంజినీర్ గంటి శ్రీనివాసరావు(54) మృతి చెందాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ప్రాంతానికి చెందిన గంటి శ్రీనివాసరావు స్నేహితుడు రుత్తల మంగరాజుతో కలిసి లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఇద్దరూ హైదరాబాద్‌లోని అనుకర్ ప్రాజెక్టులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఫార్మాసిటీ సమీపంలో కంపెనీ చేపట్టిన ఓ ప్రాజెక్టు పనులు చూస్తున్నారు. బుధవారం సాయంత్రం లంకెలపాలెంలో ఉంటున్న గదిలో దుస్తులు ఉతుక్కొని భోజనం అనంతరం నిద్రపోయారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో మంగరాజు బాత్ రూంకు వెళ్లగా.. దుస్తులు లేకుండా శ్రీనివాసరావు పడి ఉండడాన్ని గమనించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. తన భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, గుండె పోటుతో మరణించి ఉంటారని భావిస్తున్నామని పోలీసులకు మృతుడి భార్య శ్రీదేవి వివరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ..

- ప్రారంభమైన స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడా పోటీలు
- కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 600 మంది విద్యార్థుల హాజరు



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

విజయనగరం: స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం అర్బన్ స్థాయి క్రీడా పోటీలు ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగాయి. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో గురువారం నిర్వహించిన ఎంపిక పోటీలకు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గల వివిధ యాజమాన్యాల పాఠశాలలకు చెందిన 600 మందికి పైగా బాల, బాలికలు పాల్గొన్నారు. పోటీలను మండల విద్యాశాఖ అధికారి పీవీబీ రామచంద్రరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ప్రారంభించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రదర్శించేందుకు ఉత్సుకత చూపించారు. ఇందులో భాగంగా కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల, కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలల జట్లు... బాలికల విభాగంలో కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల, బాబామెట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జట్లు విజయం సాధించాయి. అదేవిధంగా అండర్-14 బాలుర విభాగంలో ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు, కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల జట్లు.... బాలికల విభాగంలో బాబామెట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కస్పా ఉన్నత పాఠశాల జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ క్రీడాంశంలో అండర్-17 బాలికల విభాగంలో కేజీబీవీ విజయనగరం, కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల జట్లు .... బాలుర విభాగంలో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల జట్టు, గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లు గెలుపొందాయి. అండర్-14 బాలుర విభాగంలో జ్యోతిరావు పూలే పాఠశాల, వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లు.. బాలికల విభాగంలో కార్పొరేషన్ కస్పా ఉన్నత పాఠశాల, వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. అర్బన్ స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్ : మండల విద్యాశాఖ అధికారి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి పీవీబీ రాజు అన్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతోమంది క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అసోసియేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంజీవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె. గోపాల్, కె. తాడుబాబు, చంటి, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు



స్కూల్ గేమ్స్ అర్బన్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మండల విద్యాశాఖ అధికారి రాజు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్



ఎమ్మెల్సీ నర్తు రామారావు సత్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ ఎస్. రామారావు యాదవ్ ఆకాంక్షించారు. శ్రీకృష్ణాష్టమి సంబరాల ముగింపు సమావేశం స్థానిక శ్రీ రాధాకృష్ణ జిల్లా యాదవ కల్యాణ మంటపంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను సన్మానించారు. అలాగే పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు యాదవ్ మాట్లాడుతూ, విజయనగరం జిల్లాలో సుమారు మూడు లక్షల మంది యాదవులు ఉన్నారని, వారికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ మధు యాదవ్ మాట్లాడుతూ, వారం రోజులుగా జిల్లాలో గల ప్రతి గ్రామంలోనూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించినందుకు నిర్వాహకులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఐక్యతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కనకమహాలక్ష్మి, యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు మన్యాల కృష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శి ముచ్చు రామలింగస్వామి యాదవ్, గదుల వెంకటరావుయాదవ్, గదుల సత్యలత యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య అవసరాలు తీర్చడానికే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- ఎంపీడీఓ రాధిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాలు తీర్చడానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్యాధికారులు, హెల్త్ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 15 నుంచి 30 వరకు ప్రతి కుటుంబాన్నీ సర్వే చేసి ఆరోగ్య అవసరాలను గుర్తించి వైద్యశిబిరాల్లో సేవలందిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైద్యాధికారి రాజేష్‌వర్మ మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి మూడు దశలలో చేయాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్యశ్రీయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనే విధానంపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజ్‌కుమార్, కె. త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

- విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



రెడ్డి శ్రీరాముల నాయుడు, కమిషనర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న వినాయక చవితి వేడుకలకు ముందుస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాంతాల్లో మంటపాలు పెట్టదలచిన నిర్వాహకులు మున్సిపల్, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులో మంటపం ఏర్పాటు చేసే స్థలం, విగ్రహం ఎత్తు వివరాలు పొందుపరచాలన్నారు. అదేవిధంగా 3 అడుగుల ఎత్తు విగ్రహానికి రూ.100, 6 అడుగుల ఎత్తు విగ్రహానికి రూ.350, అంతకన్నా పెద్ద విగ్రహాలకు రూ.700 చొప్పున రుసుం చెల్లించాలని చెప్పారు. మంటపాల ఏర్పాటులో భాగంగా రహదారులపై గుంతలు తవ్వకూడదని, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఫ్లెక్సీలు వినియోగించకూడదని స్పష్టం చేశారు. కార్పొరేషన్ అభివృద్ధి చేసిన చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేయకూడదని సూచించారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. జరజాపుపేట - 1, 8వ సచివాలయాలలో 41 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మ నారాయణ మూర్తి, కౌన్సిలర్ కింతాడ కళావతి, కో ఆప్షన్ మెంబర్ మాత సంధ్య పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్లలో 5,11 వార్డుల్లో కలిపి 17 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేదు..

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయంలో పలువురు లబ్ధిదారులకు గురువారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మంజూరయ్యేవి కావని.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అన్నివిధాలా మంచి చేస్తున్న సీఎం జగనన్నకు రాబోయే రోజుల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందం..

భోగాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందజేసి అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూడడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎంతో ఇష్టమని సర్పంచ్ అపురభుక్త పైడినాయుడు అన్నారు. మండంలోని రావాడ పంచాయతీలో కొత్తగా మంజూరైన 25 మంది లబ్ధిదారులకు స్థానిక సచివాలయంలో పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి లంచాలకు తావులేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, వాసుబాబు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను అందజేస్తున్న సర్పంచ్ పైడినాయుడు, వైస్ ఎంపీపీ రావాడ బాబు



నెల్లిమర్ల రూరల్: కొత్త పింఛన్ లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు

పైడితల్లిని దర్శించుకున్న సంగీత దర్శకుడు శ్రీచరణ్



పైడితల్లి అమ్మవారి సన్నిధిలో సంగీత దర్శకుడు శ్రీచరణ్, తదితరులు

విజయనగరం టౌన్: ప్రముఖ తెలుగు సినీ సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకల గురువారం ఉదయం పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రింగురోడ్డులో ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. క్షణం, గూఢాచారి, జెర్సీ, చాణక్య, నాంది, మేజర్, తిమ్మరుసు, డీజే టిల్లు, ఉగ్రం, గరుడవేగ, తదితర బ్లాక్‌బస్టర్ సినిమాలకు శ్రీచరణ్ సంగీత దర్శకత్వం వహించారు.

హర్షం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ ఇస్తూ ప్రభుత్వం జీఓఎంఎస్ నంబర్167 జారీ చేయడంపై కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ ప్రతినిధి కేవీఎస్ అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ హయంలో కేవలం పే (జీతం) మాత్రమే ఇచ్చేవారని.. హెచ్‌ఆర్‌ఏ, డీఏ ఇచ్చే వారు కాదని పేర్కొన్నారు. జగన్ మోహన్‌రెడ్డి వంద శాతం గ్రాస్ శాలరీ ఇవ్వడం వల్ల ఒక్కో ఉద్యోగికి రూ. 10 నుంచి 12 వేల రూపాయల వరకు జీతం పెరుగుతుందన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో 'జనంలోకి మనం'



విజయనగరం టౌన్: కోట వద్ద ర్యాలీగా వస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు



నెల్లిమర్ల రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ శాఖ వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

విజయనగరం టౌన్: భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో 'జనంలోకి మనం' అనే కార్యక్రమంలో భాగంగా పోస్టాఫీసులలో ఉన్న వివిధ పథకాలను వివరిస్తూ ఉద్యోగులు గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక హెడ్ పోస్టాఫీస్ వద్ద తపాలా మేళా చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. సుందర్‌నాయుడు మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పదేళ్లలోపున్న ఆడ పిల్లలకు ఎస్‌ఎస్‌వై, మహిళలకు మహిళా సమ్మాన్ ఖాతాలతో పాటు ఆర్‌డీలు, ఎఫ్‌డీలపై అధిక వడ్డీలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్రియ విద్యాలయ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పీవీఆర్ శేఖర్, పోస్టుమాస్టర్ యు.గణపతిరావు, పి.శ్రీనివాసరావు, ఐపీపీబీ అసిస్టెంట్ మేనేజర్ శ్రావణి, ఈ .శంకరనాయుడు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి...

నెల్లిమర్ల రూరల్: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఆ శాఖ వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జనంలోకి మనం పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, సబ్ పోస్ట్ మాస్టర్ జి. ఎర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన

నెల్లిమర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో రూ.23 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులు, కమ్యూనిటీ స్టేజ్ నిర్మాణాలకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాలు అభివృద్ధిపథంలో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మొయిద అక్కోజీరావు, నాయకులు వల్లూరి రాము, సింహాచలం, బుచ్చన్న, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా 'వైఎస్సార్ బీమా'

నెల్లిమర్ల రూరల్: కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి, నిస్సహాయ స్థితిలో ఉన్న ఎంతో మంది బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా అండగా నిలుస్తోందని సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని సతివాడలో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పెందుర్తి సూర్యనారాయణ భార్య రామలక్ష్మికి రూ.5 లక్షల వైఎస్సార్ బీమా పరిహారం పత్రాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అతిథి బోధకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఆర్.సురేష్ కుమార్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన పనిచేయడానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సీ) సబ్జెక్టు పోస్టుకు ఎంఏ (రూరల్ డవలప్‌మెంట్)/ఎమ్మెస్సీ (అగ్రికల్చర్ లేక అగ్రికల్చరల్ ఎకనామిక్స్ స్పెషలైజేషన్)/ఎంఏ ఎకనామిక్స్ విద్యార్హత, అలాగే , మెకానికల్ అండ్ ఆటోమెబైల్ టెక్నీషియన్ పోస్టుకు బీఈ/బీటెక్/ఏఎంఐఈ మెకానికల్ ఇంజినీరింగ్ లేక ఆటోమెబైల్ ఇంజినీరింగ్ విద్యార్హత, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పోస్టుకు బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఇన్ కంప్యూటర్ సైన్స్/ఐటీ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదోతరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత ధ్రువపత్రాలను జెరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేసి జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఈ నెల 20వ తేదీలోగా అందజేయాలన్నారు.

• భళా.. బాలక





వ్యర్థాలతో తయారు చేసిన వివిధ రకాల ఆకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వ్యర్థాల నుంచి వివిధ రకాల ఆకృతుల తయారీ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యర్థాలతో తయారుచేసిన ఆకృతులు ఆలోచింపజేశాయి. విజేతలకు అక్టోబర్ 2న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు శంకర్‌రెడ్డి, బలభద్రుని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉదత్తు రాజేష్, అరుణ్, ఆరిశెట్టి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం